క్లుప్తంగా

నేడు ఉరుసు



శ్రీ హజరత్ మహబూబే సుబహాని దర్గా

కమలాపురం: పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబే సుబహాని, ఖుత్బే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహిస్తున్నట్లు దస్తగిరి స్వామి దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండాను పట్టణంలోని పురవీధుల గుండా మేళ తాళాలలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తామని, అనంతరం గంధం ఎక్కించి ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

జమ్మలమడుగు రూరల్: ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఎంప్లాయీస్ అసోసియేషన్ తాలుకా సంఘం నూతన అధ్యక్షుడు రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని ట్రెజరీ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రఘురామనాయుడు, జిల్లా సెక్రటరీ కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ

జిల్లా అధ్యక్షుడిగా జి. రాజేంద్రకుమార్, సెక్రటరీగా సి. శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వి.సుధాకర్‌రెడ్డి, పి. ఇంతియాజ్, నారాయణ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా టి.లక్ష్మీదేవి, సుజన్ కుమార్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

విద్యతోనే ఉన్నత లక్ష్యాల సాధన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

పులివెందుల రూరల్ : విద్యార్థులు విద్యతో ఉన్నత లక్ష్యాలను సాధించి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ ఆకాంక్షించారు. గురువారం పట్టణంలోని స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో సర్వజ్ఞ 2కె25 అనే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఏఐకి మంచి ప్రాధాన్యత ఉందన్నారు. వర్క్ షాపులు, టెక్నికల్ క్లాసులు, కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ, హెచ్ఓడీ మురళీ, కోకన్వీనర్స్ రాధాకృష్ణ, సరిత, కోఆర్డినేటర్ మహేంద్ర, ముని లావణ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి జీవికి ఆహారం అవసరం



ప్రపంచ ఆహార దినోత్సవంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేంపల్లె : సృష్టిలో ఉన్న ప్రతి జీవికి ఆహారం అవసరమని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలోని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్-14 ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం మితంగా తీసుకుంటే ఔషధంలా పని చేస్తుందన్నారు. యువత ఎక్కువగా జంక్ ఫుడ్‌కు అలవాటు పడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతోపాటు తగిన నీరు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జె.దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం



ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తున్న వలంటీర్లు

ఎర్రగుంట్ల : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రమరెడ్డి అన్నారు. గురువారం యర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల ఎంపికలో ఓటర్ల చైతన్యమే కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు సర్వే నిర్వహించి, ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి నాగమహేశ్వర రెడ్డి, అధ్యాపకుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

శనగ విత్తనాలు ఇంకెప్పుడిస్తారు?

ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు: ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులకు శనగ విత్తనాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి విమర్శించారు. విత్తనం వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారని ఇంకెప్పుడిస్తారని అధికారులను ప్రశ్నించారు. గురువారం జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, కొండాపురం మండలాలకు చెందిన రైతులు రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేయటానికి సిద్ధంగా చేసుకున్న ప్రభుత్వం నుంచి ఇంత వరకు విత్తనాలు సరఫరా కాలేదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ ఆర్‌బీకేల ద్వారా విత్తన శనగలు సరఫరా చేసేదని, అయితే ప్రస్తుతం ఆ సంస్థకు గతేడాదికి సంబంధించిన నిధులు చెల్లించకపోవడంతో సరఫరా చేయలేదని ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. పంట వేయటానికి ఇదే సరైన సమయని, అధికారులతో మాట్లాడి విత్తనాలు సరఫరా అయ్యే విధంగా చూడాలని అన్నదాతలు రామసుబ్బారెడ్డిని కోరారు. దీంతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి జిల్లా వ్యవసాయాధికారులకు ఫోన్ చేసి రబీ సీజన్‌లో అత్యధికంగా పెద్దముడియం, మైలవరం, జమ్మలమడుగు మండలాల్లో శనగ సాగు చేసేందుకు రైతులు సన్నద్ధంగా ఉన్నారని తెలిపారు. అదునులో శనగ విత్తనాలు సరఫరా చేస్తే ఉపయోగమని, అదును దాటితే ప్రయోజనం ఉండదని వివరించారు. ఇంకా ఎందుకు సరఫరా చేయలేదని నిలదీశారు. త్వరగా శనగ విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయాధికారులను కోరారు.

రబీపైనే రైతుల ఆశలు

ఖరీఫ్‌లో వర్షాలు సరిగా కురవలేదు. పంటలు ఆశాజనకంగా లేవు. గత నెల నుంచి కురుస్తున్న వరుస వర్షాలు రబీపై ఆశలను పెంచాయి. ప్రభుత్వం సకాలంలో పప్పు శనగ విత్తనాలను సరఫరా చేస్తే తమకు మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. గతేడాది ఈ పాటికే విత్తనం సరఫరా అవగా రైతుల పంటలు వేసుకున్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల చుట్టూ విత్తనం కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందించే శనగ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది తరహాలోనే ఈ సారి కూడా సకాలంలో విత్తన పంపిణీ చేపట్టాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోండి

వేముల : రబీ సాగుకు రాయితీపై విత్తనాలు అందించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రబీ సాగుకు సకాలంలో వర్షాలు కురిసి భూములు పదును అయ్యాయని, ఇప్పటివరకు ప్రభుత్వం రాయితీ విత్తనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. శనగ విత్తనాలకు ఇప్పటివరకు రైతులతో రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని, అదును దాటాక రాయితీ విత్తనాలు ఇస్తే ఉపయోగం లేదని తెలిపారు. రబీలో రాయితీ విత్తనాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉల్లికి ధరలేక నష్టపోయారని పేర్కొన్నారు. అప్పుల్లో ఉన్న రైతులు శనగ విత్తనాలను మార్కెట్‌లో తెచ్చుకోవాలంటే ఆర్థిక పరిస్థితులు అనుకూలించక రాయితీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట నారాయణ, మల్‌రెడ్డి, గంగిరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సమతుల్యమైన ఆహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ ఎం. మాధవ

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ రోజు సమతుల్య ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ ఎం. మాధవ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరు గ్లోబల్ గ్రీన్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమోహన్, ప్రొద్దుటూరు శ్రీనిధి డైరీ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ హెడ్ జె.చంద్రశేఖర్, పులివెందుల వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ లక్ష్మీపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. మాధవ మాట్లాడుతూ ప్రస్తుతం పోషకాహార లోపం, ఊబకాయంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యలను అధిగమించేందుకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాహిత్య పోటీల్లో గెలుపొందిన వారికి, రక్తదానం చేసిన విద్యార్థులకు కళాశాల అసోసియేట్ డీన్ బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తి రెడ్డి, అధ్యాపకులు శ్రీకాంత్, జయమ్మ, రాజేష్, ఇంజినీర్ నజ్మా, సాయి శ్రీనివాస్, జాకీర్ భాషా, బి. మాధవి, ప్రదీప్, యస్.వి. సుబ్బారెడ్డి, కె. సుబ్బారెడ్డి, పీడీ రాజశేఖర్, స్నేహిత అమృత హస్తం అధ్యక్షుడు రాజు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీహెచ్ఈఓ షఫివున్నీషా

వేంపల్లె : మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పీహెచ్‌సీ డీహెచ్ఈఓ షఫివున్నీషా పేర్కొన్నారు. గురువారం తాళ్లపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ఏపీ రెసిడెన్షియల్ గురుకుల మైనార్టీ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, విద్య, సమానత్వం, సాధికారతే లక్ష్యంగా సేవ్ గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. భ్రూణ హత్యలు, బాల్య వివాహాలను నిరోధించడం, ఆడ పిల్లలను విద్యను అందించడం, సమాజంలో వీరిని గౌరవించేలా ప్రజల్లో అవగాహన కల్పించడమే సేవ్ గర్ల్ చైల్డ్ ప్రధాన లక్ష్యమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఒకవేళ నిర్వహిస్తే భారీ జరిమానాతోపాటు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుగుణమ్మ, సీహెచ్ఓలు వెంకటరత్నం, రమాదేవి, సూపర్‌వైజర్ అంకయ్య, స్టాఫ్ నర్సు అరుణ, ఏఎన్ఎం స్వర్ణ, ఆశా వర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యాప్‌తో మద్యం గుట్టు పట్టేయొచ్చు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి

పులివెందుల రూరల్ : ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం కల్తీదా, నాణ్యమైనదా అన్న విషయం తెలుసుకోవచ్చని ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వైన్ షాపుల యజమానులు, బార్ లైసెన్స్‌దారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి.. అది ఏ విధంగా పనిచేస్తుందో వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా వైన్ షాపుల్లో ప్రతి మద్యం బాటిల్‌ను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అమ్మాలని వివరించారు. ఇతర వివరాలకు 9866609927, 9440902603 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం తనిఖీ



చిర్రాజుపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీటీఎఫ్‌టీ బృందం

ఎర్రగుంట్ల: మండల పరిధిలోని చిలంకూరు పీహెచ్‌సీ పరిధిలోని చిర్రాజుపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్ టీం (డీటీఎఫ్‌టీ) బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా గర్భిణులకు రక్తహీనత పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు తదితర సేవలపై ఆరా తీశారు. అలాగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌కు ఎంత మంది లబ్ధిదారులను రేఫర్ చేశారో పరిశీలించారు. జిల్లా అధికారి రమేష్‌రెడ్డి, ఎన్ఆర్‌హెచ్ఎం మేనేజర్ నారాయణ, ఇన్‌చార్జి డీపీహెచ్ఎన్ఓ లత, టెక్నికల్ అధికారి రాజశేఖర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

కంప చెట్లు.. వాహనదారులకు ఇక్కట్లు



సింహాద్రిపురం - పులివెందుల రోడ్డుపై మలుపు వద్ద పెరిగిన కంపచెట్లు

సింహాద్రిపురం : సింహాద్రిపురం - పులివెందుల మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద మరింత ప్రమాదకరంగా ఉంది. ఇక రాత్రి సమయంలో అయితే ఆదారిన వెళ్లాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. వర్షాకాలం కావడంతో ఈ కంపచెట్లు మరింత గుబురుగా అల్లుకుంటున్నాయని, దీంతో రోడ్డుపై సంచరించే గేదేల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పరిస్థితి ఇలా ఉన్న అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ

చక్రాయపేట: వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేంపల్లెలోని మధురెడ్డి కల్యాణ మండపం వద్ద నిర్వహించనున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సతీష్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పేదలకు మెరుగైన వైద్యాన్ని, వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కాళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, ప్రైవేటీకరణ ద్వారా వాటిని సీఎం చంద్రబాబు పేదలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు.

నివాళి

తొండూరు : మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన మల్లేల నాగరాజు (55) అనే వ్యక్తి గుండె పోటుతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి గురువారం ఇనగలూరు వెళ్లి నాగరాజు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ సురేష్‌రెడ్డి, యూత్ విభాగపు జిల్లా మెంబర్ లక్ష్మిరెడ్డి, అంకాల్‌రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నియామకం

లింగాల : లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా సి.వి.రమేష్, జూనియర్ అసిస్టెంట్‌గా సుకేష్ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఎంపీడీఓ శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ వేంపల్లె పీఆర్ఐ సబ్ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న సి.వి. రమేష్ రెడ్డి లింగాల ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి హైస్కూల్‌లో పనిచేస్తూ బదిలీపై లింగాల జూనియర్ అసిస్టెంట్‌గా సుకేష్ జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారన్నారు.

జీవ ఎరువులతో పంటలకు ఉపయోగం



రైతులకు జీవ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కృష్ణప్రియ

చింతకొమ్మదిన్నె : రైతులు జీవ ఎరువుల ఉపయోగం ద్వారా పర్యావరణానికి హాని లేకుండా స్థిరమైన వ్యవసాయం చేయగలమని గుర్తించుకోవాలని కడప డాట్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ కృష్ణప్రియ సూచించారు. గురువారం మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామంలో జీవ ఎరువుల ఉపయోగాలపై డాక్టర్ కృష్ణప్రియ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు రైజోబియం, ఫాస్ఫరస్ సొల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా, పొటాష్ సొల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా, అజోస్పిరిల్లం, ట్రైకోడెర్మా వంటి జీవ ఎరువుల వినియోగం ద్వారా నేల సారాన్ని పెంచుకోవడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, పంట దిగుబడులను మెరుగుపరచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

బాలికల రక్షణ, సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న ఆరోగ్య అధికారి స్రవంతిలక్ష్మి

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం బాలికల సంరక్షణ చట్టం, కార్డియో పల్మనరీ రీసస్సిటేషన్‌పై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. వెలుగు ఏపీఎం వెంకటరమణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్లు జయరత్నమ్మ, జనార్దన్ బాబు, సమాజ ఆరోగ్య అధికారి స్రవంతిలక్ష్మి పాల్గొని మాట్లాడారు. మహిళా భద్రత, బాలికల విద్య, సమాజంలో వారి స్థానం గురించి తెలియజేశారు. జనార్దన్ బాబు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై వివరించారు. జనాభా సమతుల్యత, లింగ వివక్ష రద్దు ముఖ్యతపై వివరించడమే కాకుండా, ఈ చట్టం ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. చివరగా ఆరోగ్య అధికారి స్రవంతిలక్ష్మి కార్డియో పల్మనరీ రీసస్సిటేషన్ (సీపీఆర్)పై ప్రదర్శన నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్య సహాయం ఎలా అందించాలి అనే అంశంపై పాల్గొన్న వారికి ప్రదర్శించి అవగాహన కల్పించారు. వెలుగు వీఓలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు శుక్రవారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పెను కోరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

ఈఎన్‌టీ వైద్య సేవలు

చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దం, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన అవసరం



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ ప్రసాద్, సీఐ సీతారామిరెడ్డి

పులివెందుల రూరల్: జీఎస్టీ ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన తప్పనిసరి అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట ప్రసాద్, అర్బన్ సీఐ సీతారామిరెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలో గురువారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుంచి ముద్దనూరు రోడ్డులోని ఎంవీఐ కార్యాలయంలో వరకు బైకుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం సేల్స్‌ట్యాక్స్ ఆఫీసర్ జ్ఞానానందరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కిరాణా సామగ్రి, దుస్తులు, బైకులు, ఫోర్ వీలర్స్‌పై కూడా జీఎస్టీ తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీని సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని భారీగా తగ్గించాయని జీఎస్టీ ఫలాలను కొనుగోలు దారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంవీఐ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక క్రాస్ రోడ్డు నుంచి సబ్‌జైలు వరకు జీఎస్టీ శాఖ అధికారులతో కలసి ఆయన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ ద్వారా భారీగా వాహనాల ధరలు తగ్గాయని, కొనుగోలు దారులకు ఇది మంచి శుభవార్త అన్నారు. మోటర్ బైక్ పై రూ.10వేలు, ఆటో రిక్షాపై రూ.20వేలు, మీడియం గూడ్స్ వాహనం పై రూ.50వేలు తగ్గాయని, ఈ తగ్గదల ధరలకు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వాహనదారులు, ఆటో కార్మికులు, వివిధ వాహనాల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరూ!

- ప్రజల ఇబ్బందులను గమనించాలంటూ విన్నపాలు
- నేడు మండల సర్వసభ్య సమావేశం



బి. కొట్టాలపల్లె గ్రామంలో రోడ్లపై పారుతున్న మురుగునీరు

కొండాపురం: మండల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా.. పాత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నా ప్రజాప్రతినిధులు.. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందే. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకానున్నారు. ఈసారైనా ప్రజాసమస్యలకు ప్రాధాన్యమివ్వాలని మండల వాసులు కోరుతున్నారు. మండలంలో పేరుకుపోతున్న సమస్యలు.. తీసుకోవాల్సిన చర్యలపై కూలంకుషంగా చర్చిస్తే ప్రయోజనముంటుందని భావిస్తున్నారు.

సమస్యల తిష్ట

గ్రామాల్లో అపరిశుభ్రత, ఎక్కడ చెత్త అక్కడే నిల్వ ఉంటోంది. రోడ్లపై మురుగు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే రబీ సీజన్ ప్రారంభమైన శనగ విత్తనాల పంపిణీకి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో అదును దాటితే ప్రయోజనం లేదని ప్రైవేటు డీలర్ల వద్ద శనగలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. టి. కోడూరు గ్రామంలో కుమ్మర వీధిలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. వెంకటయ్య కాలువలో భూముల రీ సర్వే చేయడంతో అడంగల్, వన్‌బీ ఫారాలు రాక పోవడంతో బ్యాంకుల్లో రుణాలు రెన్యూవల్ చేసుకోలేక పోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. పలు గ్రామాల్లో చేతి పంపులు పని చేయలేదని, మరమ్మతులు చేయాలని గత మండల సమావేశంలో చర్చించినా.. ఇప్పటివరకు పరిష్కరించలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలోనైనా సమస్యలను చర్చించి పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జాన్ మృతి తీరనిలోటు



జాన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గిరిధర్‌రెడ్డి

జమ్మలమడుగు: విద్యావేత్త జాన్ మృతి తీరని లోటు అని వైఎస్సార్‌సీపీ నాయకుడు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఈయన ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. పట్టణంలోని జాన్స్ హైస్కూల్ వ్యవస్థాపకుడు రిటైర్డు ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు జాన్ (95) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గిరిధర్‌రెడ్డి గురువారం జాన్ స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అదేవిధంగా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు దేవదానం కూడా నివాళులు అర్పించారు. జాన్ మృతి పట్ల పలు పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు సంతాపం తెలిపారు.

సంతాపం

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు పట్టణానికి చెందిన అంబవరం జాన్ సాలోమోన్ (94) ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాతిరెడ్డి తులసి, మాజీ వైస్ చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, డాక్టర్ అగస్టీన్, జాన్ సాలోమోన్ మృతి పట్ల సంతాపం తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా ప్రముఖులు గుర్తుచేస్తున్నారు.